


పుస్తకాలు బ్యాగులో సర్దుకుని అమ్మ ఇచ్చిన లంచ్ బాక్స్ తీసుకొని ఎప్పటికిమల్లే 'వెళ్లొస్తానమ్మా'' అంది రమ. గడప దాటి కాలు బైటపెడుతున్నప్పుడు అమ్మ నాన్నతో అంటున్న మాటలు వినిపించాయి. ''ఈ కాలంలో పుట్టాల్సిన పిల్ల కాదండి. ఎంత బుద్ధిమంతురాలో. మన సంస్కృతీ సంప్రదాయాల్ని గౌరవించే కూతురుండడం మన పూర్వజన్మ సుకృతమండీ...అందునా ఈ రోజుల్లో....''


# మాంసాహార మొక్కలు

## సతీం

రమ బియస్సీ రెండో సంవత్సరంలో వుంది.

మొదటి పీరియడ్ బాటనీ...లెక్చరర్ కీటకాల్ని తినే మొక్కల గురించి పాఠం చెపుతోంది.

''పైకి అమాయకంగా కనిపించే మొక్కలు కీటకాల్ని రకరకాల ప్రలోభాలకు లోనుచేసి- ఆకర్షించి-మరలా తప్పించుకోడానికి వీలులేకుండా బంధించి-చంపేస్తాయి. వీటిని మాంసాహార మొక్కలని అంటారు. ఉదాహరణకు పీచర్ ప్లాంట్... ఇది వెదజల్లే సువాసనలకు ఆకర్షించబడి కీటకాలు దీని లోపలకి ప్రవేశిస్తాయి. లోపల అగాథంలా వుంటుంది. లోపలికెళ్లిన కీటకం బైటకి రాలేదు. బైటకి రావడానికి శతవిధాలా ప్రయత్నించి ఓడిపోయి, అడుగున వున్న నీళ్లలో పడి చచ్చిపోయి ఆ మొక్కకు ఆహారంగా మారుతుంది. వీనస్ ఫ్లై ట్రాప్ అనే మొక్క తనకున్న అందమైన రంగుల్తో కీటకాల్ని ఆకర్షిస్తుంది. కీటకం లోపలికి రాగానే ఇనుప తలుపులు మూసుకున్నట్లు దాని ఆకులు మూసుకుపోయి, వాటి మధ్యలో కీటకం నలిగిపోయి చనిపోతుంది.




మెల్లమెల్లగా ఈ మొక్క కీటకాన్ని జీర్ణం చేసుకుంటుంది''

''ఈ పీరియడ్ కాగానే బైటికెళ్దాం రావే'' అంది స్వప్న గుసగుసగా

''ఎక్కడికి?''

''మొదట బైటపడదాం. తర్వాత చెప్తాను ఎక్కడికో''

''అమ్మో నెక్స్ట్ పీరియడ్ కెమిస్ట్రీ. నేను రాను'' దిగువ మధ్య తరగతికి చెందిన రమకు చదువు ప్రాముఖ్యత తెలుసు. చదివి ఉద్యోగం తెచ్చుకుంటేనే బతుకు...లేకపోతే భవిష్యత్తంతా అంధకారమే...

''అబ్బా... చదువులో ఏముందే... బోర్. జీవితాన్ని ఎంజాయ్ చేయాలి. క్లాసులు బంక్ కొట్టని బతుకూ ఓ బతుకేనా? ప్లీజ్ రావే. మన స్నేహం కోసం ఇంత చిన్నపాటి త్యాగం కూడా చేయలేవా?''

రమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా కెమిస్ట్రీ లెక్చరర్ వచ్చేలోపల బలవంతంగా క్లాసు బైటికి లాక్కొచ్చింది స్వప్న. స్నేహితురాలి కోసం ఆ మాత్రం చేయకపోతే ఎలా అని సర్దిచెప్పుకుంది రమ.

ఇద్దరూ వేగంగా గేట్ వైపుకు నడుస్తున్నారు.

''సరే...ఇప్పుడు చెప్పు. ఎక్కడికి తీసుకెళ్తున్నావ్'' రమ అడిగింది.

''నెక్లెస్ రోడ్డుకి. ఈట్ స్ట్రీట్‌కెళుతున్నాం''

''నీకేమైనా పిచ్చా? టైం పదిన్నర. ఇప్పుడు తిండిగోలేమిటి? అయినా ఆకలేస్తే మన కాలేజీ పక్కనే క్యాంటీన్ వుందిగా''

''ఇది ఆ ఆకలి కాదులేవే. పడుచు పిల్లలకేసే ఆకలి''

''అర్థమయ్యే భాషలో చెప్పవే''

''ఓ మరిచిపోయేను. నువ్వు ఇరవైయేళ్ల ముసలమ్మవి కదా. నీకర్థం కాదులే. మాధవ్ రమ్మన్నాడు. వాడి బైక్ మీద బైటికెళ్లే ప్రోగ్రాం పెట్టుకున్నాం. లంచ్ ఏదైనా మంచి హోటల్లో లాగించేస్తాం. ఆ తర్వాత ఎంజాయ్‌మెంట్''

''ఈ మాధవ్ ఎవడే? నీ బాయ్ ఫ్రెండ్ నీరజ్ ఏమైనాడు?''

''సింపుల్. నీరజ్ పాతపడిపోయాడు. రొటీన్... అబ్బ బోర్ యార్. తుప్పు పట్టిన వాసన వేస్తున్నాడు. అందుకే డస్ట్‌బిన్‌లో పడేశా. మాధవ్ కొత్త బాయ్ ఫ్రెండ్. వారం క్రితమే ఐమాక్స్ దగ్గర పరిచయమైనాడు''

''నీ బాయ్ ఫ్రెండ్‌ని కలుసుకోవడానికి వెళుతూ మధ్యలో నన్నెందుకు రమ్మన్నావే పానకంలో పుడకలా''

''ఈ మాధవ్‌గాడు లేట్ లతీఫ్‌గాడే. చెప్పిన టయానికి రాడు. ఒంటరిగా బోర్. నువ్వున్నావనుకో... ఎంచక్కా కబుర్లు చెప్పుకోవచ్చు.''

''అతనొచ్చాక నువ్వెళ్లిపోతావ్. తర్వాత నా పరిస్థితి ఏమిటి?''

''నువ్వూ రావే. కలిసి ఎంజాయ్ చేద్దాం. వాడి పేరు మాధవ్ కదా, ఇద్దరు భామలున్నా నిభాయించుకుంటాడ్లే.''

''అమ్మో, నేనా... నీకో నమస్కారం తల్లీ.. నన్నిలా బతకనీ... ఈ రొంపిలో దింపకు'' భయంతో గుండెల మీద చేయి వేసుకుంటూ అంది రమ.

''రొచ్చు... రొంపీ... అంతా ట్రాష్. అమ్మమ్మల భాష. ఒక్కసారి దిగి చూడు స్వర్గం కనిపిస్తుంది. మన క్లాస్‌లో పాతికమంది దాకా అమ్మాయిలున్నారా... అందరికీ బాయ్ ఫ్రెండ్స్ వున్నారు. నీకు తప్ప. అందులో ఎంత మజా లేకపోతే ఒక్కొక్క అమ్మాయికి ముగ్గురు, నలుగురు బాయ్ ఫ్రెండ్స్ వుంటారు? ఆలోచించు.''

''నాకు మన సంస్కృతి మీద చాలా గౌరవముంది. మీరందరూ వెస్ట్రన్ కల్చర్‌ని గుడ్డిగా అనుకరిస్తున్నారు.''

''తల్లీ... నీ లెక్చర్లు ఆపుతావా? మన క్లాసులో నీ గురించి ఏమనుకుంటున్నారో తెలుసా? ఒక్క బాయ్ ఫ్రెండ్ కూడా లేడేంటే నీలోనే ఏదో లోపముందని, సువాసనలేని, సౌందర్యంలేని పూలజోలికి తుమ్మెదలు రావు తెలుసా. అది గొప్పతనమనుకుంటున్నావు. కానీ అందరూ నీ చాతకాని తనమని అనుకుంటున్నారు. మన సంస్కృతి, పరాయి సంస్కృతి... ఇదంతా జీవితాన్ని అనుభవించడం తెలీని వాళ్లు మాట్లాడే మాటలు.''

ఇద్దరూ ఆటో ఎక్కి కూచున్నారు.

రమ ఆలోచనల్లో మునిగిపోయింది. స్వప్న చెప్పింది నిజమే. తన క్లాస్‌లో అమ్మాయిలందరికీ బాయ్‌ఫ్రెండ్స్ వున్నారు. తను కావాలనే మగపిల్లలకు దూరంగా ఉంది. వయసొచ్చినప్పటి నుండి అమ్మ నూరిపోసిన మాటలు తన మీద చాలా ప్రభావం చూపించాయి.

''ప్రపంచ దేశాల్లో భారతదేశం తల యెత్తుకు నిలబడడానికి కారణం మన గొప్ప సంస్కృతి అనే విషయం మరవొద్దు. హైదరాబాద్ సిటీ ప్రస్తుతం కల్చరల్ క్రైసిస్‌లో వుంది. మన యువతని విదేశీ సంస్కృతి వెల్లువలా ముంచెత్తుతోంది. ఇప్పటికే మెడదాకా మునిగిపోయాం. ఇక పూర్తిగా మునిగి వూపిరాడక చచ్చిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. నువ్వు జాగ్రత్తగా వుండు. ఆడపిల్లవి కాబట్టి ఒద్దికగా వుండాలని చెప్పడం లేదు. నువ్వు ఈ తరం అమ్మాయివి. దానికి తగ్గట్టే వుండు. మగపిల్లల్తో మాట్లాడడం తప్పని నేనను. నీ హద్దుల్లో వుండు. సో ఫార్ నో ఫర్దర్ అంటారే... అలా... నైతిక విలువల పతనం కానంత వరకూ మోడర్నిటీలో తప్పు లేదు.''

మగ పిల్లల్తో స్నేహం చేస్తే తప్పేమిటని తనూ చాలాసార్లు ఆలోచించింది. కానీ తన క్లాస్‌లోని అమ్మాయి స్నేహాలు ఎలాంటివో తెలిసాక ఆగిపోయింది. ఇప్పుడు స్నేహమంటే మనసుకే పరిమితం కాదు. శరీరానికి కూడా... కలిసి తిరగడాలు, డేటింగులు, నెక్కింగులు... అసలేదీ నిషిద్ధం కాదు.

ఈట్‌స్ట్రీట్ దగ్గర ఆటో దిగాక, ''రావే, మాధవ్ వచ్చేవరకూ లోపల కూర్చుని కబుర్లు చెప్పుకుందాం'' అంది స్వప్న.

రెండు ఐస్‌క్రీంలు కొనుక్కుని ఖాళీగా వున్న టేబుల్ దగ్గర కూర్చున్నారు.

పక్కన మంద్రమైన అలలతో అల్లిబిల్లి కబుర్లు చెప్తున్న హుస్సేన్‌సాగర్ జలాలు...నగరంలో విస్తరిస్తోన్న విషసంస్కృతికి శిలగా మారిన బుద్ధుడి విగ్రహం...చల్లటిగాలి...తియ్యటి చల్లని ఐస్‌క్రీం....పాష్‌గా, మోడ్రన్‌గా డ్రెస్ చేసుకున్న అమ్మాయిల కేరింతలు....వాళ్ల పక్కనున్న అబ్బాయిల తుళ్లింతలు.

ఆ హోటల్‌కి రావడం రమకు అదే మొదటిసారి. ''ఇక్కడ చాలా బావుందే'' అంది రమ.

''నాతో కాదే. నీ మనసుకి నచ్చిన కుర్రాడితో వచ్చినప్పుడు ఆ థ్రిల్ ఏమిటో తెలుస్తుంది. నేనూ మొదట వినయ్‌తో వచ్చానిక్కడికి. వినయ్‌ని నువ్వు చూడలేదులే. ఇంటర్‌లో నా బాయ్‌ఫ్రెండ్''

''ఇంటర్ నుంచే బాయ్‌ఫ్రెండ్స్ వుండేవాళ్లా?''

''నేనింకా నయమే. నా ఫ్రెండ్ సుజాత వుందే దానికి టెన్త్ క్లాస్ నుండే వున్నారు. ఈ వయసులో కాకపోతే ఎప్పుడు ఎంజాయ్ చేస్తాం చెప్పు. పెళ్లయ్యాక ఎలాగూ ఆంక్షలు తప్పవు. నా మాట విను. ముసలమ్మలా ఎన్నాళ్లు ముడుచుకుని కూచుంటావు? కళ్లు తెరిచి చుట్టూ వున్న సమాజాన్ని ఒకసారి చూడు. ఎంత ఫాస్ట్‌గా మారిపోతోందో... ఒకప్పుడు బాయ్‌ఫ్రెండ్ వున్నాడని చెప్పుకోవడం నామోషీగా భావించేవారు. చేసేవాళ్లందరూ గుట్టుగా చేసేవాళ్లు. కానీ ఇప్పుడో.... ఎంత ఎక్కువమంది బాయ్ ఫ్రెండ్స్‌ని మెయింటైన్ చేస్తే అంత గొప్ప.''

"తప్పు కదా... మన సంస్కృతీ సాంప్రదాయాలు..."

"అంతా డొల్ల... శుష్క వేదాంతం. ఇప్పుడున్న జీవితాన్ని ఎంచక్కా ఎంజాయ్ చేయకుండా మడికట్టుకొని కూచుని.... చచ్చాక స్వర్గానికెళ్లి సుఖాలు అనుభవిస్తామా? నాన్సెన్స్, చచ్చాక ఏమౌతుందో నీకు తెలుసా? నాకు తెలుసా? ఈ క్షణమే నిజం... ఈ రోజు మనది. రేపేమౌతుందో తెలీదు. మన ఎదురుగా రాసులుగా పోసి వున్న సుఖాల్ని మూర్ఖంగా కాలదన్నుకోకు. ఎంజాయ్ చేయడానికి ఇదే సరైన టైం. దొరికినంత అందులో..అందినంత జుర్రుకో..."

"అమ్మో"

"ఏమిటే అమ్మో... మరోసారి అమ్మో అన్నావంటే చంపేస్తా. ఆడపిల్లలు ఎంత ధైర్యంగా ఉన్నారో చూడు. ఒక్కసారి మంచికుర్రాడితో స్నేహం చేసి చూడు. నీ భయాలు, గియాలు దెబ్బకు ఎగిరిపోతాయి."

"అలా కుర్రాళ్లతో తిరిగితే ధైర్యంగా ఉన్నట్లా? బరితెగించినట్లు కాదా?"

"ఆడపిల్ల బరిలో వుండాలని నిర్ణయించే అధికారం సమాజానికెవరిచ్చారు? మన జీవితాల్ని శాసించే చనువు మనమెందుకివ్వాలి. అసలు బరే లేనప్పుడు దాన్ని తెగించడమనే సమస్యే రాదు. ఎల్లలు లేని స్వేచ్ఛ మన స్వంతం. మనసుకు నచ్చిన అబ్బాయితో వూసులాడడంలో వున్న హాయి...వాడితో కలిసి బైక్ మీద షికార్లు కొట్టటంతో వున్న తీపి....అనుభవించని ఆడపిల్ల బతుకు దండగ"

"నిజంగా అంత బావుంటుందా?"

"మెల్లగా అంటావేమిటి? ఒక్కసారి రుచి చూసావా?... ఇక వదలమన్నా వదలవు"

"అమ్మో వద్దు" అంది రమ. కొద్దిసేపాగి "ఐనా నాకు నచ్చే కుర్రాడు దొరకాలంటే వెతకొద్దు...నేనెక్కడ వెతకనూ"

"అదా నీ సమస్య? నీకు శ్రమ లేకుండా నేను వెదికిపెడ్తానులేవే. స్నేహితురాలి కోసం ఆ మాత్రం చేయలేనా?" అంది స్వప్న.

వాళ్లు కూచున్న టేబుల్ దగ్గరకో కుర్రాడొచ్చి, అభివాదం చేస్తున్నట్లు కొద్దిగా ఒంగి "హాయ్ స్వీట్ హార్ట్" అన్నాడు స్వప్నతో.

"హాయ్ లేట్ లతీఫ్. గంటాలస్యమైంది తెలుసా? అసలు నీకోసం ఇంత అందమైన అమ్మాయి ఎదురుచూస్తుంటే ఆలస్యం చేయడానికి మనసెలా ఒప్పింది?" స్వప్న బుంగమూతి పెట్టింది.

"మనసా... ఏం మనసు? నా దగ్గర లేదు. నీకెప్పుడో ఇచ్చేశాగా" అన్నాడు కొంటెగా.

"చాల్లే...నువ్వు మాటకారివని నాకు తెలుసులే" అంటూ రమ వైపుకు తిరిగి "రమా..దీసీజ్ మాధవ్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వర్కింగ్ ఇన్ విప్రో. నా బాయ్ ఫ్రెండ్. మాధవ్... దీసీజ్ రమ. మై బెస్ట్ ఫ్రెండ్" అంది.

"హాయ్" అంటూ అతను చేయిచాపాడు.

రమ బెరుగ్గా స్వప్న వైపు చూసింది.

"ఫర్లేదులే చేయి కలపవే. నిన్నేమి కొరుక్కుతినడు" అంది నవ్వుతూ స్వప్న.

అతను రమ చేతిని సున్నితంగా నొక్కి వదిలాడు రమ సిగ్గులమొగ్గయింది.

"మీ ఫ్రెండ్‌కి సిగ్గెక్కువనుకుంటాను" అన్నాడతను. రమ ఓరకంట అతన్ని చూసింది.

తెల్లగా, పొడవుగా వున్నాడతను. స్లిమ్‌గా, ట్రిమ్‌గా వున్నాడు. వెనక్కి దువ్విన జుట్టు...అల్లరిగా నవ్వే కళ్లు...అందంగా వున్నాడు.

"దీని సిగ్గు దొంగలు దోలా...దాని చేతిని తాకిన మొట్టమొదటి మగాడివి నువ్వే తెలుసా. కంగ్రాట్స్" అంది స్వప్న.

"ఓ ఐయాం సో లక్కీ.. యాహూ"

"దీనికి మంచి బాయ్ ఫ్రెండ్‌ని వెదికిపెట్టు. అప్పటిగ్గాని ఇది మనిషి కాదు"

"ఆశ్చర్యంగా వుందే. ఇంత అందమైన అమ్మాయికి ఇప్పటి వరకూ బాయ్‌ఫ్రెండ్స్ లేరా?" అని ఓ క్షణ మాగి "ఐనా ఎవర్నో వెదకడం దేనికి? నేనున్నానుగా" అన్నాడు.

"చంపేస్తా" అంది స్వప్నకళ్లు పెద్దవి చేసి తర్జనితో బెదిరిస్తూ.

"సారీ... సారీ... జోక్ చేశానంతే. నా కొలీగ్ సామ్రాట్ వున్నాడు. రేపే పిలుచుకొచ్చి పరిచయం చేస్తాను"

"బావుంటాడా? మొదట నాకు చూపించు. నేను ఓకే చేశాకే రమకు పరిచయం చేద్దాం"

"పేరుకు తగ్గట్టే అందగాడు. నాకంటే బాగుంటాడు సరేనా"

"ఐతే నన్ను లైనేయమంటావా?" అంది అల్లరిగా స్వప్న.

"నన్నన్యాయం చేస్తావా ప్రియా" అన్నాడతను గుండెల దగ్గర పట్టుకుంటూ.

"టేకిట్ ఈజీరా...సరదాగా అన్నాలే. పద వెళదాం. ఈరోజు ఎక్కడికి పిల్చుకెళ్తావో నీ ఇష్టం. రాత్రి తొమ్మిది వరకు నీ ఆధీనంలో వుంటాను. ఏం చేసుకుంటావో చేస్కో." అంది . రమని ఆటో ఎక్కించి పంపించాక.

"నీకిచ్చిన మాట నిలబెట్టుకున్నాను. నీ ఫ్రెండ్ కోసం అమ్మాయిని చూసి పెట్టమన్నావుగా. రమ అమాయకురాలు. దాన్ని జాగ్రత్తగా చూసుకొమ్మని చెప్పు"అంది స్వప్న.

రమకు ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఈట్ స్ట్రీట్‌లో వాళ్లిద్దరి మాటలు వింటుంటే... వాళ్ల మొహాల్లో కదలాడిన సంతోషం చూస్తుంటే ఈర్ష్యగా అనిపించింది. తనకూ అలాంటి బాయ్ ఫ్రెండ్ వుంటే ఎంత బావుంటుంది? అనే ఆలోచన మొగ్గతొడిగి... పూవుగా మారింది.

సామ్రాట్ అట. పేరు ఎంత బావుందో...మనిషి కూడా బావుంటాడని కదా అన్నాడు. నీ మనసుకు నచ్చిన కుర్రాడితో స్నేహం చేయి అంది స్వప్న. చూడంగానే మనసుకి నచ్చాడో లేదో ఎలా తెలుస్తుంది? కంటికి నచ్చిన కుర్రాడితో అనాలేమో....

సామ్రాట్‌తో ఎంత చనువుగా మెలగాలి? స్వప్న మాధవ్‌తో వున్నంత చనువుగానా... వుహూ... తనలా వుండలేదు. అమ్మ నాన్నతో ఎన్నిసార్లో తన గురించి మురిసిపోతూ చెప్పడం తను వింది.

"టివిలు, సినిమాలు చూసి నేటి తరం పిల్లలు చెడిపోతున్నారండి. పదో తరగతి నుండే ప్రేమా దోమా అంటూ భవిష్యత్తుని పాడుచేసుకుంటున్నారు. మన పిల్ల చూడండి. తన చదువేదో తనేదో. చివరకి వూహల్లోకి కూడా చెడు ఆలోచనల్ని రానివ్వదు".


ఉత్తర భారతావని పుణ్యక్షేత్రాల దర్శనం

Badrinath - Kedarnath - Gangotri - Yamunotri - Kailash Manasarovar


Badrinath Temple


Kedarnath Temple

Fare includes Transport, Twin Sharing Accommodation, Veg. Food and Guide Services. We are running L.F.C. / L.T.C. Tours. All tours are by Super Deluxe Buses starting from our New Delhi Office.

While in NEW DELHI, Stay at HOTEL SOUTHERN

ఢిల్లీలో అసలైన తెలుగు భోజనం

మీరు ఢిల్లీ వచ్చినపుడు అధునాతన సౌకర్యములతో ఒప్పింపబడిన 75 రూములు గల హోటల్ సదరన్‌లో బస చేయండి. రుచికరమైన తెలుగు భోజనం హోటల్లోని కామత్ సదరన్ / అమరావతి రెస్టారెంట్లలో లభించును.

Branch Off.: Hotel Rajkamal Complex, Kumara Park East, Bangalore - 560 001.
Ph: 2226 2633 / 2226 7040, Mobile: 93412 61945
e-mail: bangalore@southerntravels.in

| PACKAGE TOURS | Frequency | Fare: Rs. |
|---|---|---|
| 1. Delhi - Badrinath - Kedarnath - Delhi. Duration: 7 days with Food and Accommodation | Monday / Friday | 5,500/-* 7,500/- |
| 2. Delhi - Badrinath - Kedarnath - Gangotri Yamunotri - Delhi. Duration: 11 days with Food and Accommodation | Friday | 8,500/-* 11,500/- |
| 3. - Kailash Manasarovar Yatra : 16 Days "Flight Tickets to and fro Kathmandu are extra at discounted rates" | April to September | 63,000/- |

We arrange economy flight tickets. * With sharing dormitory accommodation

- Car Rental A.C. / Non A.C. - 12 / 18 / 25 / 35 / 45 Seater Coaches on Hire

SOUTHERN TRAVELS PVT. LTD.
(Recognised by Ministry of Tourism, Govt. of India) Since 1970

ఢిల్లీలోని తెలుగువారి ప్రముఖ వాణిజ్య సంస్థ

Head Off.: 18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi-110 005
Ph: 2875 4210 (10 Lines), 4353 2828, Mobile: 93138 22210, Fax: 011-2875 7308
e-mail: book@southerntravels.in website: www.southerntravelsindia.com

తను కేవలం స్నేహం చేస్తుందంతే. తనకు తన హద్దులేమిటో తెలుసు. అనుకున్నాక మనసులోని అలజడి తగ్గి కొద్దిగా నిద్ర పట్టింది.

***

ఓ నెల గడిచింది. స్మార్ట్ తో పార్కులకూ, హోటళ్లకు వెళ్లడం...గంటల తరబడి కబుర్లు చెప్పుకోవడం...అసలిన్నాళ్లూ ఇటువంటి సంతోషానికి, సుఖానికి ఎందుకు దూరంగా వున్నానా అని బాధపడింది. ఈ మధురమైన అద్భుతమైన స్వర్గాన్ని తనకు పరిచయం చేసిన స్వప్నకు మనసులోనే ఎన్నోసార్లు కృతజ్ఞతలు తెల్పుకుంది.

మొదట్లో క్లాసులు ఎగ్గొట్టటం ఇబ్బందనిపించినా రానురాను అలవాటైపోయింది. ఇంట్లో వాళ్లకు అబద్ధాలుచెప్పడం కూడా....

శనివారం రోజు క్లాసులయిపోయాక బస్‌స్టాప్ వైపుకు నడుస్తూ "రేపేమిటి నీ ప్రోగ్రాం' అని అడిగింది స్వప్న.

"నథింగ్ స్పెషల్"

"మా మాధవ్ గాడు రేపో స్పెషల్ ప్రోగ్రాం అరేంజ్ చేశాడు. కారు తెస్తాడట. నువ్వూ, నేను, స్మార్ట్.... పబ్‌కెళ్లాలని ప్లాన్. ఇంట్లో ఏదో ఒకటి చెప్పిరా...ఫుల్‌డే...రాత్రి పదో పదకొండో కావచ్చు"

"పబ్‌కెళ్లి ఏం చేస్తాం" పబ్‌ల గురించి విని వున్నా కన్‌ఫర్మ్ చేసుకోవడానికి అడిగింది.

"డ్రింక్స్ తీసుకుంటాం. లైట్‌గానేలే. ఆ తర్వాత డ్యాన్స్...తర్వాత డిన్నర్"

"డ్రింకులా...అంటే కోక్, పెప్సీలాంటివా?"

"నీ బొంద...హాట్ డ్రింక్స్"

"అమ్మో...నేనురాను"

"ఈ అమ్మో అనే పదం ఇంకా వదల్లేదా? స్మార్ట్ ఏం చేస్తున్నాడు? చాతకాని దద్దమ్మలా వున్నాడే. ఆడపిల్లల డ్రింకులు వేరే వున్నాయిలేవే... బీర్, జిన్, వైన్...చాలా లైట్‌గా వుంటాయి. కోక్ తాగి నట్లే అనుకో."


"తాగాక ఎట్లా వుంటుంది?" ఓ వైపు కుతూహలంగా బాధిస్తుండగా అడిగింది.

"చాలా బావుంటుంది. గాల్లో తేలుతున్నట్లుంటుంది. మేఘాల్లో విహరిస్తున్నట్లుంటుంది. తాగి డ్యాన్స్ చేస్తుంటే నక్షత్ర లోకంలో వున్నట్టుంటుంది."

"మా ఇంట్లో తెలిస్తే తిడ్తారు. నాకొద్దు. నేను కూల్‌డ్రింకే తీసుకుంటా"

"సరే నీ ఇష్టం. ఐనా ఇంట్లో వాళ్లకు చెప్తావేమిటి? చెప్పి స్మార్ట్‌తో తిరుగుతున్నావా? ఇదీ అంతే" అంటూ నవ్వింది స్వప్న.

మరునాడు కార్లో డ్రైవింగ్ సీట్లో మాధవ్,స్వప్న కూర్చున్నారు. స్మార్ట్‌తో కలిసి పబ్‌కెళ్లడం ఎంతో ఎగ్జయింటింగ్‌గా వుంది రమకు. పబ్‌కెళ్లే ఆడపిల్లల సంఖ్య పెరిగిందని తను చాలాసార్లు పేపర్లలో చదివింది. టీవీ మీడియాలో పబ్ కల్చర్ మంచిదా కాదా అనే చర్చలు వింది. పబ్‌లెలా వుంటాయో చూడాలని ఇన్నాళ్లుగా అణిచిపెట్టుకున్న కోరిక ఈ రోజు తీరబోతున్న ఆనందం ఆమె మొహంలో కాంతి పుష్పంలా విచ్చుకుంది.




"జిన్ అంటే ఏంటో తెలుసా? ఉత్త లైమ్ జ్యూస్. నీ చుట్టూ ఒక్క సారి చూడు. అమ్మాయిలు హుషారుగా విస్కీలు, రమ్ములు ఎలా లాగించేస్తున్నారో" స్మార్ట్ బలవంతపెడ్తుంటే ఏం చేయమంటావు? అన్నట్టుగా స్వప్న వైపు చూసింది.

అప్పటికే స్వప్న రెండో పెగ్గులో వుంది. "నోటి దాకా వచ్చిన అమృతాన్ని కాలదన్నుకుంటావో...లేక మోడర్న్ గర్ల్‌లా ముందుకెడ్తావో నీ ఇష్టం" అంది. ఆమె మాట ముద్దముద్దగా ముద్దుముద్దుగా వుంది. కళ్లు స్వాప్నిలం కావడం స్పష్టంగా తెలుస్తోంది.

తాగితే ఎలా వుంటుందోనన్న ఉత్సుకత.... ఒక్క సారి తాగితే తప్పేముందన్న వాదన.. 'దీనికి బానిస కాకుండా నన్ను నేను కంట్రోల్ చేసుకునే మానసిక శక్తి నాకుంది కదా. మరెందుకు భయం' అనే ఆత్మ వంచన...

రమ జిమ్‌లో మిరిండా కలుపుకొని తాగింది. బావుంది... స్మార్ట్ మరో పెగ్ అందించాడు. ఈసారి హాయిగా, ఏ రకమైన సంకోచం లేకుండా ఎంజాయ్ చేస్తూ తాగింది. తల దిమ్ముగా వుంది. శరీరం తేలికైంది. అడుగులు భూమికి అడుగెత్తున పడ్తున్నట్లు...

వూరిస్తున్న వాతావరణం....వూపేస్తున్న సంగీతం...శరీరంలో ఏదో తెలీని తీపి ఆరాటం.... అప్రయత్నంగానే డ్యాన్స్‌ఫ్లోర్ పైన నిలబడి...స్మార్ట్‌తో కలిసి డ్యాన్స్ చేస్తుంటే... ఎంత బావుందో...

తిరిగి ఇళ్లకు బయల్దేరేటప్పటికి రాత్రి పదకొండున్నర దాటింది. రమ రాత్రికి రాదని, తమింట్లోనే వుండి చదువుకుంటుందని స్వప్న రమా వాళ్లింటికి ఫోన్ చేసి చెప్పింది.

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ పన్నెండు మలుపు దగ్గర పోలీసులాపేశారు.

మూతలు పడ్తోన్న రమ కళ్లు భయంతో విచ్చుకున్నాయి.

"కంగారు పడకు. మాధవ్ వున్నాడుగా. మేనేజ్ చేస్తాడు." ధైర్యం చెప్పింది స్వప్న.

బ్రీత్ ఎనలైజర్‌తో నలుగుర్నీ టెస్ట్ చేశారు.

"తాగి డ్రైవ్ చేయడం నేరం. మీరు నలుగురూ తాగి వున్నారు" అన్నాడు ఎస్సై

"ఆడపిల్లలు తాగడం ఎక్కువైపోయింది సార్... నిన్న రాత్రి పన్నెండు మందిని బుక్ చేస్తే అందులో ఎనిమిది మంది తాగి డ్రైవ్ చేస్తున్న అమ్మాయిలే." అన్నాడు కానిస్టేబుల్.

"గ్లోబలైజేషన్ పుణ్యమా అంటూ పాశ్చాత్య సంస్కృతి మన గడపలు దాటి ఇళ్లలోకి వచ్చేసింది. ఏం చేస్తాం." అని మాధవ్ వైపు తిరిగి " ఆడపిల్లల మీద కేసులు పెట్టం. వాళ్ల పేరెంట్స్‌కి ఫోన్ చేసి చెప్పి వాళ్లని ఆటోలో ఇంటికి పంపించే ఏర్పాటు చేస్తాం. మీ ఇద్దరి మీద కేసులు పెడ్తాం" అన్నాడు యస్సై. మాధవ్ పక్కనే స్మార్ట్ నిలబడి వున్నాడు.

రమకు భయంతో చెమటలు పడ్తున్నాయి. తాగిన మత్తంతా దిగిపోయింది. ఇప్పుడు వీళ్లు ఇంటికి ఫోన్ చేసి అమ్మానాన్నకు విషయం చెపితే ఇంకేమైనా వుందా?

"ప్రతి చిన్నదానికి ఎందుకంత వర్రీ అవుతావు? నేనున్నానుగా. నువ్వు నా సిస్టర్ అని చెప్తా. మా ఇంటి నెంబరు ఇస్తా. సరేనా... ఐనా అంతదాకా రానివ్వడు మాధవ్. వాడి మేనేజీరియల్ కెపాసిటీ మీద నాకు నమ్మకముంది. అనుభవంతో చెప్తున్నా. నథింగ్ విల్ హేపెన్" అంది స్వప్న.

ఆమె చెప్పినట్లు కేసేమీ లేకుండా మేనేజ్ చేశాడు మాధవ్.

"వెయ్యి రూపాయలు సమర్పించుకున్నా " డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూ అన్నాడు.

"డబ్బేగా...పోనీ పరువు ముఖ్యం" అంది స్వప్న

***

పరీక్షలు దగ్గరపడ్తున్నా చదవలేకపోతోంది రమ. మనసులో ఏదో చిక్కుముడి. అసహనం... ఆరోగ్యం బావుండడం లేదు. తన శరీరంలో మరో శరీరం రూపుదాల్చుకునే ప్రయత్నంలో కలుగుతున్న అలజడి.

"ఎందుకీ మధ్య డల్‌గా వుంటున్నావు" అడిగింది స్వప్న.

"డల్‌గానా..కాదు దిగులుగా వుంటున్నాను. విపరీతమైన డిప్రెషన్‌లో వున్నాను" రమ కళ్లలో నీళ్లు ఉబికాయి.

"ఓ...సీరియస్ సమస్యలా వుందే. నాకెందుకు చెప్పలేదూ? స్మార్ట్‌తో గొడవపడ్డావా?"

"ఔను"

"ఇంత చిన్న విషయానికి డిప్రెషనా? వాడు కాకపోతే వాడిలాంటివాళ్లు కో అంటే కోటి మంది. ఎడంకాలితో తన్ని వదిలేయ్ వాణ్ని"

"నేను నెల తప్పాను."

మొదట విస్మయంగా చూసింది స్వప్న.

"అంత ఫూలిష్‌గా ఎలా వున్నావే? జాగ్రత్తలు

తీసుకోవాలని తెలీదా? వాడికేం మగాడు. కడుపొస్తే కష్టాలు మనకేగా''

''నువ్వేగా చెప్పావ్. మనం మగవాళ్లతో అన్నింట్లో సమానమేనని. ఒకప్పుడు వాళ్లు నలుగైదుగురు అమ్మాయిల్తో తిరిగేవారు. ఇప్పుడు మన ఛాన్స్. మనం నలుగురైదుగురు అబ్బాయిల్తో తిరుగుతున్నాం అని''

సమాధానం చెప్పడానికి స్వప్న తడబడింది.

''సమానమే అనుకో... ఐనా దేవుడున్నాడో లేదో తెలియదు. కానీ వుంటే మాత్రం చాలా పక్షపాతి. ఆడపిల్లల్ని ఈ విషయంలో అన్యాయం చేశాడు''

''నాకేం చేయాలో తెలియడం లేదే. భయమేస్తోంది.'' రమ వెక్కిళ్లు పెట్టి ఏడుస్తోంది.

''భయం దేనికి? చాలా సింపుల్. నాకు తెల్సిన హస్పిటల్ వుంది. అబార్షన్ చేయించుకో''

''అబార్షనా?''

''ఈ రోజుల్లో చాలా కామన్ తెలుసా. మూడు నాలుగు సార్లు అబార్షన్లు చేయించుకున్న అమ్మాయిలు కూడా వున్నారు. టేకిట్ ఈజీ యార్. జీవితం ఏడ్వడానికి కాదు. ఎంజాయ్ చేయడానికి''

''స్మార్ట్ మోసం చేసి ఇలా మధ్యలో వదిలేస్తాడనుకోలేదు.''

''మోసం, దగాలాంటి పెద్ద మాటలు వద్దు. నో సెంటిమెంట్స్. వాడు నీతో ఆడుకున్నాడు. నువ్వు వాడితో ఆడుకున్నావు. దట్సాల్.''

''అతని జ్ఞాపకాలు బాధిస్తున్నాయే''

''అంతా ట్రాష్. మరో కుర్రాడితో పరిచయమైతే అవన్నీ మరుగున పడిపోతాయి. వారం క్రితం మాధవ్‌తో పాటు రాహుల్ అని ఓ కుర్రాడొచ్చాడు. ఇంజనీరింగ్ ఫైనలియర్ చేస్తున్నాడు. స్వంత కారుంది. బాగా డబ్బుంది. అబార్షన్‌కయ్యే ఖర్చు వాడి దగ్గర లాగేయ్. వాళ్ల నాన్నకు ఏదో బిజినెస్ వుందట. కుర్రాడు బావున్నాడు. రేపు పరిచయం చేస్తాను''

రమ బేలగా ఆమె వైపు చూసింది.

''నా మాట విను. ఇవన్నీ ఇప్పుడు అమ్మాయిలకు మామూలే. నువ్వే ఇంకా గాడిలో పడలేదు. డోంట్ వర్రీ. నేను చెప్పినట్లు చేయి'' అంది స్వప్న.

దుఃఖంతో నిండిపోయిన రమ కన్నీటి సముద్రంలా వుంది.

రాత్రి ఏడుగంటల సమయం....నగరం రంగురంగుల విద్యుద్దీపాల్తో సింగారించుకున్న అభిసారికలా వుంది. పబ్‌లూ, రెస్టారెంట్లు, కాఫీడేలు, డిస్కోథెక్‌లు, పార్కులు, రెస్టారెంట్లు, ఛానెళ్లు, టీవీలు, సినిమాలు ఎటు చూసినా మాంసాహార మొక్కలు నిండిపోయినట్లు...కీటకాలు తినే చిన్న చిన్న మొక్కలు కాదు...మనుషుల్ని తినే మొక్కలు...తమ అందమైన రంగురంగుల వలల్ని విసిరి...సువాసనల మంత్రజాలం చల్లి...మనుషుల్ని ఆకర్షించి...కొద్దికొద్దిగా జీర్ణం చేసుకునే మొక్కలు.

బరువైన అడుగుల్తో ఇంటి లోపలకి అడుగు పెట్టి, తన గదిలోకి వెళ్లబోతున్నప్పుడు అమ్మ నాన్నతో అంటున్న మాటలు వినిపించాయి. ''మనమ్మాయి ఎంత బుద్ధిమంతురాలో... ఈ కాలం పిల్ల కాదు...''

రమ తలొంచుకొని తన గదిలోకి వెళ్లిపోయింది.

★



## కొత్త బాయ్‌ఫ్రెండు!

కొలుజారినా ఫరవాలేదుగానీ నోరుజారితే బాలీవుడ్‌లో కష్టమే. ఆమధ్యన ఒకసారి ఏదో సందర్భంలో బాయ్‌ఫ్రెండు మానవ్ గురించి ఏదో ఒకమాట అనగానే సుస్మితను ఇప్పుడు మానవ్‌తో లింకుపెట్టి మరీ ఏడిపిస్తున్నారు. రణదీప్ ఏమయ్యాడు, అతన్ని వదిలేసినట్టేనా, ఫ్రెండ్షిప్‌కు కటీఫ్ చెప్పేవా, మానవ్ ఏం చేస్తుంటాడు, ఏదైనా ఎఫైర్ వుందా, పెంపుడు కూతురు రెనీ ఏమీ అనట్లేదా ఇన్ని ప్రశ్నలతో నా బుర్ర వేడెక్కించారని చెబుతోంది సుస్మిత. ఇంతకీ ఇటీవలే తెరమీదికొచ్చిన మానవ్ మాత్రం సుస్మిత కొంగుపట్టుకు తిరుగుతున్నాడు. ఆమధ్య జరిగిన దీపావళి వేడుకల నుంచీ ఇప్పటివరకూ ప్రతి ఫంక్షన్‌కూ ఇద్దరూ కలిసే వెళుతున్నారుట. అయినా వయసు పైబడిన సుస్మితనే మగాళ్లు ఎందుకు లైక్ చేస్తున్నారూ అనేదే తోటి నటీమణుల ఈర్ష్య!